క్లుప్తంగా

చివుకుల శ్రీలక్ష్మికి ఉగాది పురస్కారం


చివుకుల శ్రీలక్ష్మి

విజయనగరం టౌన్: ప్రముఖ రచయిత్రి, జిల్లా రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు చివుకుల శ్రీలక్ష్మికి ఉగాది పురస్కారం అందజేయనున్నట్లు వాగ్దేవీ సమారాధనం సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పి.స్వప్నహైందవి తెలిపారు. గురజాడ స్వగృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వాగ్దేవీ సమారాధనం సంస్థ చతుర్థి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రచయిత్రి శ్రీలక్ష్మికి వాగ్దేవీ సాహితీ సుధ బిరుదుతో ఉగాది రోజున సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు అనంత రవికుమార్ ఆచార్యులు, ధవళ సర్వేశ్వరరావు, దేవరాజు గోపాలకృష్ణ, సంధ్య, షేక్ గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ


మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు భావ వ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయి నుంచే కలిగి ఉండాలని గురజాడ పాఠశాల డైరెక్టర్ ఎం. కృష్ణాజీ అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ స్వరూప, హెచ్‌ఎం పి. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత అభివృద్ధి సాధించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మహిళలు మరింత అభివృద్ధి సాధించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బొత్స పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సత్యవతి, పద్మావతి, కాంచన ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుకారీబాబు, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ కె. రవి, శ్రీనివాసన్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో (బాలికలు) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఏప్రిల్ 23న ఉదయం ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు.

పెట్టుబడులు రావడం గొప్ప విషయం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం గొప్ప విషయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సమ్మిట్ విజయవంతం కావడంతో బుధవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెట్టుబడులకు ఆంధ్రా బెస్ట్ చాయిస్ అనేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నమ్మకం కల్పించారన్నారు. ఒకే రోజు 352 ఎంఓయూలు చేసుకోవడం దేశంలోనే ఒక రికార్డ్ అని చెప్పారు. వివిధ కంపెనీలు ఏర్పాటు వల్ల ఆరు లక్షల మందికి ప్రత్యక్షంగా.. పది లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కలగనుందని తెలిపారు. విశాఖకు అంతటి భాగ్యాన్ని కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర ప్రజలు రుణపడి ఉండాలన్నారు. ముఖ్యమంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయబోయే పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుని, ఉత్తరాంధ్ర ఉనికి చాటాలని పిలుపునిచ్చారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ, విశాఖ అభివృద్ధికి కంకణం కట్టుకున్న జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, గొర్లె రవి కుమార్, కె.వెంకటరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సీహెచ్ పద్మావతి, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్ మెరపుల సత్యనారాయణ, పుణ్యగిరి ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ, మోపాడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు శుభాకాంక్షలు..

ఆమె తల్లిలా లాలిస్తుంది... చెల్లిలా తోడుంటుంది.. భార్యగా బాగోగులు చూస్తుంది... కుటుంబ భారాన్ని మోస్తూ సర్వం త్యాగం చేస్తుంది... అంతటి గొప్ప స్త్రీ మూర్తికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మన సారా శుభాకాంక్షలు తెలియజేశారు.. మహిళా దినోత్సవాన్ని బుధవారం వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సన్మానాలు చేయడంతో పాటు పలు కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



డెంకాడ: లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం


విజయనగరం టౌన్: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మహిళా స్వీపర్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ, తదితరులు


విజయనగరం అర్బన్ నినాదాలు చేస్తున్న బ్యాంక్ మహిళా ఉద్యోగులు


విజయనగరం ఫోర్ట్: మహిళా గ్రామీణ వైద్యులను సత్కరిస్తున్న వైద్యురాలు నవీన



నెల్లిమర్ల : జరజాపుపేటలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి


విజయనగరం టౌన్: మహిళా పోలీస్‌ను సత్కరిస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు


విజయనగరం: అయ్యపేటలో రక్తదానం చేస్తున్న మహిళ


విజయనగరం: శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం


విజయనగరం ఫూల్‌బాగ్: ర్యాలీలో పాల్గొన్న మహిళలు


విజయనగరం ఫూల్‌బాగ్: కార్యక్రమంలో మాట్లాడుతున్న చిట్టిబాబు


నెల్లిమర్ల: ఉపాధ్యాయినులను సన్మానించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు


విజయనగరం : వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఉత్తమ మహిళలకు సత్కారం

వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు ఉన్నత స్థానం


సత్కారం పొందిన మహిళలతో నిర్వాహకులు

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలు రంగాల్లో రాణించిన మహిళలకు సత్కారాలు

విజయనగరం: మహిళలకు అన్ని రంగాల్లో ఉన్నత స్థానం కల్పించినది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మూకల కస్తూరి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళ సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళలు సొంతంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నామినేటెడ్ పదవులలో 50 శాతం మహిళలకు కేటాయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా చట్టం తీసుకువచ్చారని గుర్తు చేశారు. అలాగే సమాజం కూడా మహిళలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. స్త్రీ ఉంటేనే సమాజం మనుగడ ఉంటుందని, రోజురోజుకూ ఆడపిల్లల సంఖ్య తగ్గడం ప్రమాదకరమన్నారు. మహిళలు తమ చుట్టూ తామే రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మూకల కస్తూరి, ప్రముఖ నాట్యకారిణి తెలికిచెర్ల సౌమ్య, డాక్టర్ దివ్య పూసర్ల, లక్ష్మీశ్రీనివాస్, జ్యోతిలను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ ఈసరపు రేవతీదేవి, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి, రామభద్రపురం జెడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి, యశోద, రాజేశ్వరి, పీరుబండి హైమావతి, కనకల సుజాత, రెడ్డి పద్మావతి, పిలక దేవి, లంక వరలక్ష్మి, గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

నడక, పరుగు పోటీలకు స్పందన


800 మీటర్ల పరుగుకు సిద్ధమైన మహిళలు

విజయనగరం:

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన నడక, పరుగు పోటీలకు స్పందన లభించింది. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 25 సంవత్సరాల లోపు వయసు గల మహిళలకు నిర్వహించిన 800 మీటర్ల పరుగు పోటీలో ఆర్.భారతి, పి.పూజిత, జె.ఝాన్సీ మొదటి మూడు స్థానాలు దక్కించుకోగా... 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు నిర్వహించిన 800 మీటర్ల నడక పోటీలో ఎ.అరుణ, పి.మౌనిక, కె.లైలా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సిల్వర్ మెడల్స్ దక్కించుకున్న వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్. ఆదిలక్ష్మి, ఎస్.విజయలక్ష్మిలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా సంగిడీ రాళ్ల పోటీలు


సంగిడీ రాయి ఎత్తుతున్న గొల్లు సంతోష్‌కుమార్

భోగాపురం: మండల కేంద్రంలో కనకదుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. 15 మందికి పైగా వస్తాదులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. నిర్వాహకులు 60 కిలోల నుంచి 140 కిలోల సంగిడీ రాళ్లను సిద్ధం చేశారు. ఇసురు, పోటు, తీత మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించిన సీఐ కేవీవీ విజయనాథ్, ఎస్సైలు కృష్ణమూర్తి, మహేషలను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆళ్ల వెంకటేశ్వరరావు, కొమ్మూరు సుభోషణరావు, ఆళ్ల విశ్వేశ్వరరావు, ఉదయబాబు, పడాల భానుప్రకాష్, రౌతు వాసు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయానికి కృషి చేయాలి


మహిళల కోసం పాట రూపకల్పన చేస్తున్న ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు

విజయనగరం టౌన్: మహిళల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక కళాపీఠంలో మహిళలపై ప్రత్యేకమైన పాటను రూపకల్పన చేసి మహిళామణులకు అంకితం చేశారు. అనంతరం కళాపీఠం, శ్రీవారి సేవాసంఘం గాయనీమణులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలను గౌరవించుకోవడం మన బాధ్యతని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలన చూసి ఓట్లేయండి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం


నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న లక్ష్మణరావు


విజయనగరం: దాసన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని పట్టభద్రులకు అభ్యర్థించారు. ఈ మేరకు నగరంలోని 7, 2వ డివిజన్ల పరిధిలో గల ఫూల్‌బాగ్, దాసన్నపేట కొత్తవీధి ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సీతంరాజు సుధాకర్‌ని గెలిపించాల్సిన ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని గమనించి సీతంరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, ముద్దాడ మధు, కార్పొరేటర్ బండారు ఆనంద్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించాలి..

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు ఓటువేసి గెలిపించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ధవళ లక్ష్మణరావు కోరారు. పట్టణంలోని మిమ్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పెదమజ్జి వెంకటరావు, ఆర్. రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కే క్రీడాకారులంతా ఓటు వేయాలని నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు కోరారు. స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: కొల్లాయివలసలో సీతంరాజుకు మద్దతుగా ఎన్నికలు ప్రచారం నిర్వహిస్తున్న అప్పలనాయుడు, తదితరులు

సీతంరాజుకు మద్దతుగా..

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ, పసపాం, కొల్లాయివలస గ్రామాలలో సీతంరాజుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, పి.లక్ష్మీనారాయణ, గుజ్జు సురేష్‌రెడ్డి, దాడిశెట్టి త్రినాథరావు, పైడి సుజాత, మధుబాబు, టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: క్రీడాకారులను ఓటు అభ్యర్థిస్తున్న చిక్కాల